నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 24 డిసెంబర్ 2023 | KAMAREDDY

కామారెడ్డి పట్టణంలో గోపాలస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

రైతు దినోత్సవం

జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సిరికొండ మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన చిన్నారులు జై కిసాన్ అనే ఆంగ్ల అక్షర ఆకృతిలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి అన్నం పెడుతున్న రైతుల శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు.
– సిరికొండ, డిసెంబర్ 23

ముక్కోటి వైభవం

కిటకిటలాడిన వైష్ణవాలయాలు
ప్రత్యేక పూజలు, ఉత్తరద్వార దర్శనం

సుభాష్‌నగర్ రామాలయంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గోవిందా... గోవిందా నామస్మరణతో వేంకటేశ్వరాలయాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని జిల్లాలోని వైష్ణవాలయాలన్నీ శనివారం భక్తులతో సందడిగా మారాయి. ఉదయం 4గంటల నుంచి ఆలయ అర్చకులు పూజలు చేసి ఉత్తరద్వారం ద్వారా దర్శనాలు కల్పించారు. మూడుకోట్ల దేవతల అనుగ్రహం, వైకుంఠ ప్రాప్తి కలిగించే ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తరద్వార దర్శనం విశేషమైందని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జెండా బాలాజీ మందిరం, సుభాష్‌నగర్ రామాలయం, గంగస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రం, బ్రహ్మపురి పెద్దరాంమందిరం, చక్రంగుడి, ఖిల్లా రఘునాథాలయం, న్యాల్ కల్‌రోడ్ రామాలయం... తదితర ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి భక్తులు బారులుతీరారు.
–నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 23

ప్రేమతో ఇచ్చే కానుక కోట్లతో సమానం

మంచి మనస్సుతో చేసే పనులకు దేవుడి ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుంది
బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, డిసెంబర్ 23: ప్రేమతో ఇచ్చే కానుక ఏదైనా కోట్ల రూపాయలతో సమానమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంచి మనస్సుతో చేసే పనులకు దేవుడి ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో శనివారం ముందస్తు క్రిస్మస్ సంబురాలు నిర్వహించగా..ముఖ్యఅతిథిగా పోచారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లతో కలిసి కేట్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని వెయ్యి మందికి క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ..రాష్ట్రంలో కుల మతాలకు అతీతంగా పేదలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం క్రిస్మస్ పండుగకు ప్రతి ఏటా కానుకలను అందజేసిందని తెలిపారు. ప్రజలకు ఏమి కావాలో తెలుసుకొని వారికి సమకూర్చే బాధ్యత ప్రభుత్వాలు, నాయకులదని పేర్కొన్నారు. సమాజంలో పది మందికి సేవ చేయాల్సిన చేతు ఉండాలని, అదే చేతితో దోచుకుంటే చాలా బాధ కలుగుతుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.రైతులు, ప్రజలకు సాగు, తాగునీరు, విద్యుత్, వైద్య, విద్య రంగాల్లో నంబర్ వన్ స్థానంలో ఉంచినట్లు చెప్పారు. నియోజవర్గంలో 11 వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేశానని, ఇందులో సొంతిల్లు నిర్మించుకునేందుకు జీవో రాకపోయినా తాను ధైర్యంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. 11 వేల ఇండ్లలో నాలుగు వేల ఇండ్లు పేదలకు కట్టించి ఇచ్చామని, మిగిలిన ఇండ్లు సొంత స్థలాల్లో కట్టుకున్నారని, వాటన్నింటికీ బిల్లులు మంజూరు చేసినట్లు వివరించారు. మందిరాలు, మసీదులు, చర్చిలకు నిధులు మంజూరు చేశానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో భుజంగరావు, తహసీల్దార్ వరప్రసాద్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ దొడ్ల నీరజా వెంకట్రామ్ రెడ్డి, విండో చైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, ఎజాస్, వాహబ్, పాస్టర్ ఏసుదాస్, జాన్‌వెస్లీ, ప్రశాంత్, థామస్, తార తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లకు పండుగ కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

అక్క అంత్యక్రియల విషయంలో మనస్తాపం

గొంతు కోసుకుని వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం
నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఘటన

శక్కర్‌నగర్, డిసెంబర్ 23: తన సోదరి అంత్యక్రియలు సరిగా జరిపించలేదని మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు.. తన పరిస్థితి ఏమిటో అని ఆందోళనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్నది. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని తట్టికోట్ ప్రాంతానికి చెందిన రుద్ర అబ్బవ్వ (73) నివాసముంటున్నారు. ఆ పక్కనే ఆమె కుటుంబం కూడా నివాసముంటున్నది. ముగ్గురు కుమారులు ఉన్న అక్క ఇటీవలే చనిపోగా, అంత్యక్రియల విషయంలో కొడుకులు గొడవ పడ్డారు. ఇది చూసి చెల్లెలు అబ్బవ్వ మనస్తాపానికి గురయ్యింది. ముగ్గురు కుమారులు ఉన్న సోదరి విషయంలో ఇలా జరిగిందని, ఏకైక కుమారుడు ఉన్న తన పరిస్థితి ఏమిటో అని ఆవేదన చెందింది. దీంతో ఈ నెల 20న బుధవారం ఇంట్లో ఉరేసుకునేందుకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమె మెడకు ఉన్న తాడును తొలగించడంతో బతికి బయటపడింది. కానీ, అదేరోజు రాత్రి అందరూ పడుకున్న తర్వాత అబ్బవ్వ గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన నిజామాబాద్‌లోని దవాఖానకు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై బోధన్ పట్టణ సీఐ వీరయ్య వివరణ కోరగా, వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

'న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి'

నిజామాబాద్ లీగల్, డిసెంబర్ 23: న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన ఎదుగుదలకు బార్ కౌన్సిల్ కృషి చేస్తున్నదని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలోని పీపీ గంగా రెడ్డి మెమోరియల్ హాల్‌లో శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల న్యాయవాదులనుద్దేశించి ప్రసంగించారు. బార్ కౌన్సిల్ నిరంతర ఆలోచనలకు, ఆచరణకు రూపమిచ్చి న్యాయవాదుల సంక్షేమ పథకాలకు బాటలు వేస్తున్నామని అన్నారు. న్యాయసంబంధిత విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి సెమినార్లు ప్రయోజనకారిగా ఉంటాయన్నారు. బార్ కౌన్సిల్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక వనరులు సమీకరించుకొని మరిన్ని ప్రగతి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టుకుంటామని ఆయన తెలిపారు. బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, కొల్లి సత్యనారాయణ, అనంతసేన రెడ్డి, భైరపాక జయకర్, కొండారెడ్డి, కిరణ్ పాలకుర్తి, రామారావు, మధుసూదన్ తమ సందేశాలను వినిపించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి ప్రసంగిస్తూ గిరిగీసుకొని ఉండరాదని, న్యాయసంబంధిత విషయ పరిజ్ఞానం సముపార్జించుకోవాలని, నూతన చట్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ న్యాయవాదులు నిత్య విద్యార్థులేనని, నిరంతర అధ్యయనమే వృత్తిని వృద్ధి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్ చాండక్, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి బాగీ చరణ్, రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి నాగలక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

నవీపేట,డిసెంబర్ 23: నిజాంసాగర్ చివరి ఆయకట్టు వరకు అలీసాగర్ లిఫ్టు ద్వారా పంటలకు సాగునీటిని అందించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నదని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోస్లీ గోదావరిపై శనివారం అలీసాగర్ నీటి విడుదలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ నియోజకవర్గంలో 80వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని తెలిపారు. అభంగపట్నం ఎర్రకుంట ద్వారా సాగర్ చివరి ఆయకట్టు రాంపూర్ వరకు సాగునీటిని అందించాలని లక్ష్మీకిసాన్ ఫారం రైతు దొంత ప్రసన్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అందుకు స్పందించిన ఎమ్మెల్యే రాంపూర్ వరకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డిప్యూటీ ఈఈ బాల్‌రాంను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దా దన్నగారి విఠల్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ బద్రీనాథ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్ హుస్సేన్, ఏఈ ప్రణయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట మండలం కోస్లీ వద్ద అలీసాగర్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పిట్లం దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పిట్లం/ డోంగ్లీ, డిసెంబర్ 23: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు స్పష్టం చేశారు. శనివారం ఆయన పిట్లంలో వైద్యశాల, డోంగ్లీలో తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పిట్లం దవాఖానలో వైద్యాధికారుల రిజిస్టర్లను పరిశీలించి, వారిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులు కచ్చితంగా సమయపాలన పాటించాలని సూచించా రు. వైద్యాధికారులు స్థానికంగా ఉంటూ రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డోంగ్లీ తహసీల్‌లో రిజిస్టర్లను పరిశీలించారు.నాయబ్ తహసీల్దార్ రాచప్పా హాజరుపట్టికలో సంతకం చేసి వెళ్లిపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన వచ్చేవరకు తాను ఇక్కడి నుంచి వెళ్లేదిలేదని, ఫోన్‌చేసి పిలవాలని ఆదేశించారు.

మూడు అంశాలకే ఆమోదం

కామారెడ్డి మున్సిపల్ సమావేశం వాయిదా

కామారెడ్డి, డిసెంబర్ 23 : కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో మొత్తం 16 అంశాలకు గాను మూడు అంశాలకు ఆమోదం తెలిపి.. మిగతావాటిని వాయిదా వేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించగా.. స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. సమావేశంలో మొత్తం 16 అంశాలపై చర్చజరగాల్సి ఉండగా..1 నుంచి 2 వరకు ఆమోదం తెలిపారు. మిగతా అంశాలను వాయిదా వేశారు. అనంతరం నూతనంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు సన్మానించారు.సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

ఏపీవో సస్పెన్షన్

నవీపేట, డిసెంబర్ 23: నవీపేట మండల ఏపీవో రాజేశ్వర్‌ను సస్పెండ్ చేస్తూ ఎన్ఆర్ఈజీఎస్, డీఆర్డీవో చందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. కోస్లీ గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ శైలేందర్ రెండేండ్ల క్రితం చేపట్టిన ఇంకుడు గుంతల పనులకు సంబంధించిన ఎంబీ రికార్డును ఈజీఎస్ ఏపీవో రాజేశ్వర్ లంచం ఇస్తేగానీ చేయకపోవడంపై నిరసిస్తూ శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీవో రాజేశ్వర్‌ను సస్పెండ్ చేశారని, ఇన్‌చార్జి ఏపీవోగా నామ్‌దేవ్‌కు బాధ్యతలను అప్పగించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

విధి నిర్వహణలో అశ్రద్ధను సహించేదిలేదు..

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 23: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్పష్టం చేశారు. శనివారం ఆయన పట్టణంలోని డివిజన్, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. తనకు ఎవరినీ ఇబ్బంది పెట్టే యోచనలేదని, అందరం కలిసి ఎల్లారెడ్డిని అభివృద్ధి పథంలో నడిపిద్దామని సూచించారు.పనిని కష్టంగా కాకుండా ఇష్టంగా చేయాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం తమ శాఖల పని తీరును అధికారులకు ఎమ్మెల్యేకు వివరించారు. సమావేశంలో రెవెన్యూ, ఉపాధిహామీ, ఐకేపీ, పీఆర్, వ్యవసాయశాఖ, కో– ఆపరేటివ్, మార్కెటింగ్, సివిల్ సప్లయీస్, విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్, ఆరోగ్యశాఖ, మిషన్ భగీరథ, రోడ్స్ అండ్స్ బిల్డింగ్స్, ఇరిగేషన్, విద్యుత్, ఐసీడీఎస్, ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ డెవలప్‌మెంట్, బీసీ డెవలప్‌మెంట్, ఎస్సీ కార్పొరేషన్, మైనార్టీ వెల్ఫేర్, మెప్మా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

మేధస్సుకు పదును

వైజ్ఞానిక ప్రదర్శనలకు ఆహ్వానం
జనవరి 16వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్

కామారెడ్డి, డిసెంబర్ 23: చిట్టిబుర్రల్లో మెదిలే ఆలోచనలకు పదునుపెట్టి అద్భుతాలు సృష్టించవచ్చు. చిన్నారుల్లో సైన్స్‌పై జిజ్ఞాసను పెంచేందుకు, నూతన ఆవిష్కరణల రూపకల్పనలను ప్రోత్సహిందుకు విద్యాశాఖ ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహిస్తున్నది. విద్యార్థులు పాఠశాలల్లో నేర్చుకున్న విజ్ఞానంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిశోధన, ప్రాజెక్టుల నమూనాలు రూపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు వేదిక కానున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి ప్రదర్శనలకు ఆహ్వానం పలుకుతున్నది. 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్ విభాగం, 9 నుంచి పదోతరగతి వరకు సీనియర్ విభాగంలో తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు.

జనవరి 16వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్..
వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు జనవరి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జనవరి 18,19వ తేదీల్లో జిల్లాస్థాయి ప్రదర్శనలు చేసేందుకు గూగుల్ ఫాం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు కల్పించింది. ముందుగా పాఠశాల, మండల, జిల్లాస్థాయిలో నిర్వహించి ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారిని జాతీయస్థాయికి పంపిస్తారు. జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చదివే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు అర్హులు.

సృజనాత్మకతకు దోహదం..
విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకంలో వివిధ రకాల ప్రాజెక్టులను రూపొందించి నిత్యం ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపే అవకాశం ఉన్నది. సైన్స్ ఫెయిర్‌లో భాగంగా విద్యాశాఖ ప్రతి ఏడాది ఒక అంశాన్ని ఎంపిక చేస్తుంది. అందుకనుగుణంగా విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించనున్నారు. ఈ ఏడాది సైన్స్ టెక్నాలజీ ఫర్ సొసైటీ అనే అంశాన్ని ప్రధానంగా ఎంచుకున్నారు. ఉప అంశాలుగా ఆరోగ్యం, లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, వ్యవసాయం, కమ్యూనికేషన్, ట్రాన్స్‌పోర్టు, కంప్యూటర్ థింకింగ్ అనే వాటిపై విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేయాల్సి ఉంటుంది. వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులతోపాటు పాఠశాల నుంచి ఒక గైడ్ టీచర్ కూడా హాజరుకావొచ్చు.

ప్రతిభను వెలికితీసేందుకే..
విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయి. 6,7,8వ తరగతి జూనియర్ విభాగంలో, 9,10వ తరగతి విద్యార్థులు సీనియర్ విభాగంలో పాల్గొని తమ ప్రతిభను చాటాలి. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వివరాలకు 94404 14250 సంప్రదించాలి.
- సిద్ధిరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, కామారెడ్డి